

ఆచంట మండలంలో వర్షం


ఆచంటలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం ఒక్క సారిగా మేఘావృతమై అక్కడక్కడా చెదురుమదురు వర్షాలు పడ్డాయి. దీంతో వాతావరణం చల్లబడింది. మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, వల్లూరు, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు తదితర గ్రామాల్లో ఒక మోస్తారు వర్షం పడింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతాంగంలో ఆలజడి నెలకొంది. దీంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ముందస్తు సాగు సాగేనా..!

ఖరీఫ్‌లో ముందస్తు సాగుపై ప్రతియేటా ప్రకటనలు గుప్పించడం.. షరా మామూలు అన్నట్లుగా నారుమడులు ఆలస్యంగా వేయడం, దీంతో ప్రతియేటా రబీసాగుపై తీవ్ర ప్రభావం చూపడం పరిపాటిగా మారిపోయింది. ఈసారి ముందస్తు సాగుకు పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రైతులకు అవగాహన కల్పించి అధికారులు ప్రణాళికలు అమలు చేస్తారా అనే చర్చ నడుస్తోంది.



- **జూన్ 1న కాలువలకు నీరు విడుదలకు సిద్ధం**
- **నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నట్లు వాతావరణశాఖ వెల్లడి**
- **ఖరీఫ్ సాగుపై ముందస్తు ప్రణాళికలు జరిగేనా**
- **రెండు జిల్లాల్లోనూ దాదాపు 4 లక్షల ఎకరాల్లో వరిసాగు**
- **ఖరీఫ్ సాగు ఆలస్యంతో ప్రతియేటా రబీపై తీవ్ర ప్రభావం**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్‌లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టనున్నారు. జూన్ ఒకటో తేదీన పంట కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. నైరుతి రుతుపవనాలుసైతం జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావంతో ఈ నెల 24వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈసారి ముందస్తు సాగుకు వాతావరణం అనుకూలంగా ఉన్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. ప్రతియేటా జూన్ ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేస్తున్నప్పటికీ నారుమడులు మాత్రం సకాలంలో వేయడం లేదు. జులై మొదటి వారం వరకూ నారుమడులు వేయని పరిస్థితి ఉంటుంది. ఎండలు ఎక్కువగా ఉండటం వంటి కారణాలతో రైతులు ముందుకు రావడం లేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రైతులకు ఇప్పటి నుంచే ముందస్తు సాగుపై అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు సాధించే అవకాశం ఉంది. అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి. ఖరీఫ్ సాగు ఆలస్యం కావడంతో ప్రతియేటా రబీలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగునీటి సమస్యతోపాటు అకాల వర్షాల బారిన పడి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది సైతం మే రెండో వారంలోనూ రబీ మాసూళ్లు సాగాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. గతేడాది మాత్రం రబీలో కురిసిన వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా ఖరీఫ్‌లో గాలులకు నేలకొరగని విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్‌లో అత్యధికంగా సంపత్ స్వర్ణ విత్తనాన్ని రైతులు వినియోగిస్తున్నారు. ఇంకా మెరుగైన విత్తనాలు ఉంటే రైతులకు అధికారులు సూచిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. రైతులకు కిలోకు రూ.ఐదు సబ్సిడీతో విత్తనాలు, ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులన్నీ సిద్ధం చేసినట్లు లెక్కలు వివరిస్తున్నారు. జూన్ రెండో వారంలోనే నారుమడులు వేసేలా రైతులకు అవగాహన కల్పిస్తేనే ఖరీఫ్ సాగు గాడినపడే అవకాశం ఉంటుంది. అలాకాకుండా జూన్ నెలాఖరు వరకూ నారుమడులు వేయకపోతే పరిస్థితి ప్రతియేటా మాదిరిగానే తయారవుతుంది. వాతావరణం అనుకూలంగా ఉన్న ఈ పరిస్థితుల్లో అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తే ముందస్తు సాగు ప్రణాళికలు ఫలించే అవకాశం ఉంటుంది. అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.

ఇసుక అక్రమ రవాణాదారులపై క్రిమినల్ కేసులు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు, సిబ్బందితో నిఘా


అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - కుక్కునూరు, వేలేరుపాడు

జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. వేలేరుపాడు మండలం రుద్రంకోట 1, 2 రీచ్‌లు, కుక్కునూరు మండలంలోని దాచారం, వంజరం, ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌లను జిల్లా అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతి ఉన్న ఇసుక రీచ్‌ల్లోనే ఇసుక తవ్వాలని, అనుమతి లేని రీచ్‌లలో తవ్వకాలు నేరమన్నారు. ఇసుక అక్రమ తవ్వకం, అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని షెడ్యూల్ ఏరియాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని రుద్రంకోట 1, 2 రీచ్‌లు, దాచారం, వంజరం, ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక అక్రమ మైనింగ్, రవాణా నిరోధించేందుకు సీసీ టీవీలు ఏర్పాటు చేసి, సిబ్బందితో నిరంతరం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, ఇసుక అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేయడంతోపాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసు, గనులు, సెబ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రుద్రంకోట, ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌ల వద్ద స్థానిక ప్రజలను ఇసుక అక్రమ తవ్వకం, రవాణాపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానికులతో మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకం, రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. జిల్లాలోని షెడ్యూల్ ప్రాంతాల్లో ప్రతి ఇసుక రీచ్ వద్ద 24 గంటలూ పనిచేసేలా సీసీ కెమెరాలు, సిబ్బందితో నిరంతరం పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతుంటే వెంటనే స్థానికులు దగ్గరలోని రెవెన్యూ, పోలీసు లేదా గ్రామ విఆర్‌ఒలకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కలెక్టర్ వెంట ఎస్‌పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ సత్యనారాయణ, గనుల శాఖ డిడి బి.రవికుమార్, భూగర్భ జలశాఖ డిడి విజయ్‌కుమార్, రెవెన్యూ, పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఫీడర్ అంబులెన్స్‌లు వినియోగించాలి

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్, కుక్కునూరు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అతిసార వల్ల అస్వస్థత, మరణాలు పెరుగుతున్నాయని, అలాగే మహిళలు ప్రసవాల సందర్భంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్‌లు వెళ్లలేని ప్రాంతాలకు ఫీడర్ అంబులెన్సులు పంపి వైద్య సేవలు అందించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీడర్ అంబులెన్సులు 2018లోనే ప్రవేశపెట్టారని, ఐటిడిఎ పరిధిలోని పిహెచ్‌సిలకు ఒకొక్కటి చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అయితే అవి చాలావరకు మరమ్మతులకు గురై, డ్రైవర్లకు జీతాలు ఇవ్వక, పెట్రోల్ బిల్లులు రాక, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూలనపడ్డాయని విమర్శించారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి ఏజెన్సీ ప్రాంతంలో రోగాలు మరింత ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం వెంటనే డ్రైవరకు 3, 4 నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు చెల్లించాలని, పెట్రోల్ బిల్లులు ఇవ్వాలని, మరమ్మతులో ఉన్న వాహనాలను బాగు చేసి ప్రతి పిహెచ్‌సి వద్ద ఉంచాలని డిమాండ్ చేశారు. కుక్కునూరు, అమరవరం, వేలేరుపాడు, కోయిదా, అంతర్వేదిగూడెం, దొరమామిడి, పులిరామన్నగూడెం, కోండ్రుకోట, వింజరం తదితర ప్రాంతాల్లో ఫీడర్ అంబులెన్సులు గతంలో మంజూరు చేశారని పేర్కొన్నారు. వాటిస్థానంలో కొత్తవి అక్కడికి పంపాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగు చర్యలు తీసుకుని వారిని రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

దళితులపై అగ్రకుల పెత్తందార్ల దాడి అమానుషం

కామవరపుకోట మండలం కంఠంనేనివారిగూడెంలో దళిత యువకునిపై అగ్రకుల పెత్తందారుల దాడిని రవి ఖండించారు. రాజ్యాంగంలో దళితులకు హక్కులు, చట్టాలున్నా వాటిని ఉల్లంఘిస్తూ అగ్రవర్ణకుల పెత్తందారులు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. దళితులపై దాడుల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని, పోలీసులు దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని రవి డిమాండ్ చేశారు. కంఠంనేనివారిగూడెంలో దళిత యువకునిపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకుని యువకునికి న్యాయం చేయాలని ఆయన కోరారు.

కర్రసాము ఉచిత శిక్షణ ప్రారంభం


ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు

ఆత్మ రక్షణ కోసం, శారీరక వ్యాయామం కోసం ఉపయోగపడే కర్రసామును అందరూ నేర్చుకోవాలని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎఆర్‌డిజికె హైస్కూల్‌లో కర్రసాము ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు మాట్లాడుతూ శిక్షణా శిబిరానికి సమన్వయకర్తగా కె.శ్రీనివాసరావు వ్యవహరిస్తారని తెలిపారు. మాస్టర్స్ జోగా చంద్రశేఖర్, జోగా మోహన్‌రావు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారని, ఏలూరులోని యువతీ యువకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ సెల్ జిల్లా సభ్యులు మేతర అజయ్ మాట్లాడుతూ శారీరక దారుఢ్యం, మానసిక ధైర్యం పెంపొందించుకోవడానికి కర్రసాము ఉపయోగపడుతుందన్నారు. ఎఐటియుసి నాయకులు కె.కృష్ణమాచార్యులు కర్ర సాము చేసి శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ ఎం.మిల్టన్, ఎన్‌వి.గంగాభవాని, పి.దుర్గాప్రసాద్, సిహెచ్.జగదీష్, పి.అనురాధ, మేతర అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న విజయరాజు, నిర్వాహకులు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ విద్యు త్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజుతో కలిసి ఆయన చలివేంద్రంలో మజ్జిగను పంపిణి చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు మాట్లాడుతూ ఇపిడిసిఎల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ఎండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇపిడిసిఎల్ ఉద్యోగులను ఆయన అభినందించారు. ఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు మాట్లాడుతూ ఏలూరు సర్కిల్ ఉద్యోగులు బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఏలూరు సర్కిల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కిడ్స్ వరల్డ్ ప్రారంభం


ప్రారంభిస్తున్న గోవిందరాజు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

చిన్నారులను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచేందుకు, మెదడుకు పదును పెట్టే ఆటపాటలకు చేరువ చేసేందుకు ఏలూరు నగరంలో 'కిడ్స్ వరల్డ్' ప్రారంభమైంది. ఈ కిడ్స్ ప్రపంచం ఏలూరులోని పత్తేబాద్ గంగా చికెన్ సెంటర్‌కు సమీపంలో ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.గోవిందరాజు సోమవారం దీన్ని ప్రారంభించారు. అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమంలో కిడ్స్ వరల్డ్ అధినేత జి.రాఘవ దంపతులు ఆహుతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జి.రాఘవ మాట్లాడుతూ చిన్నారులకు ఆహ్లాదం కలిగించే 15 రకాల ఆటలను తాము ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ 'కిడ్స్ వరల్డ్ ఇండోర్ ప్లే జోన్ అండ్ పార్టీ' సంస్థను భవిష్యత్తులో మరింతగా విస్తరించబోతున్నామన్నారు. చిన్నారులకు బర్త్‌డే పార్టీలు, ఫొటోషూట్ వంటి అనేక కార్యక్రమాలను తాము రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.


చిన్నారుల కేరింతలు


చిన్నారులకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు

వినోదం, విజ్ఞానం వేసవి వినోద శిబిరాల లక్ష్యం

ఏలూరు అర్బన్:వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదం, విజ్ఞానం అందించడమే లక్ష్యంగా హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి వినోద శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి, హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఏలూరులో జిల్లా గ్రంథాలయం, బాలల గ్రంథాలయం, వంగాయగూడెం మున్సిపల్ స్కూలు, శనివారపుపేట జంగిల్ బెల్ స్కూల్, గన్‌బజార్ అంగన్వాడీ కేంద్రం తదితర చోట్ల పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఏలూరులో ప్రతియేటా వేసవి సెలవుల్లో విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానం అందించే అనేక అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. ఆటలు, పాటలు, డ్యాన్స్, చిత్ర లేఖనం, మ్యాథమెటిక్స్‌లో ట్రిక్స్, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు తెలియజేయడం, ఆడ పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, కరాటే వంటి అంశాలు నేర్పిస్తున్నట్లు వివరించారు. ఏలూరులో సుమారు 20 ప్రాంతాల్లో ఈ వేసవి వినోద శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు జి.శారద, ఉష అశ్విని, చీమకుర్తి రాజేశ్వరి, యు.దుర్గ, పవన్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఠాగూర్‌రాజా, కె.లెనిన్ ఐద్వా నాయకులు పి.ఉషారాణి పాల్గొన్నారు.


పేరుకుపోయిన గుర్రపుడెక్కను చూపుతున్న రైతు నేతలు

ఏలూరు కాల్వలో పూడిక తీయాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు గోదావరి కాలువలో గుర్రపు డెక్క, తూడు, మట్టి పూడికతీసి కాలువను బాగు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఉండ్రాజవరం, కొవ్వలి గ్రామాల వద్ద ఏలూరు గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, మట్టి పూడికను సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యే దశలో కాలువలు బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వలో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో శివారుప్రాంత భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. జలవనరుల శాఖ అధికారులు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం వల్ల సాగునీరు అందక రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలువ బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, కొల్లి విజయభాస్కర్‌రెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలి


- **పని ప్రదేశాల్లో తాగునీరు, టెంటు ఏర్పాటు చేయాలి**
- **ఆన్‌లైన్ యాప్ రద్దు చేయాలి**
- **వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ**

ప్రజాశక్తి - దెందులూరు

ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన టెంట్, తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సంఘం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సుమారు 40 నుండి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్నారన్నారు. ఎండ తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్నా ఉపాధి కూలీలకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కూలీలు గత సంవత్సరం పని చేసిన దినాలకు నేటికీ కూలి అందలేదని, సుమారు నాలుగు వారాలు కూలి రావాలని తెలిపారు. రాష్ట్ర అధికారులు పని ప్రదేశాల్లో కూలీల పని నాణ్యతను చూస్తున్నారే తప్ప కూలీలకు రావాల్సిన వేతన బకాయిలు మాత్రం నేటికీ విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఉపాధి హామీ పనుల్లో పంట కాలవలు, చెరువుల్లో పూడిక తీయడం వంటి పనులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం అంటే ఉపాధి హామీ పనులకు గండి కొట్టడమవుతుందన్నారు. దీనిపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. పని చేసిన కూలీలకు పే స్లిప్ ప్రతివారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనికి అవసరమైన పనిముట్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలకు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


దెందులూరు మండలంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బుట్టాయగూడెం: పెండింగులో ఉన్న ఉపాధి హామీ వేతన బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో చెంచుగూడెం, రేకులకుంట గ్రామాల్లో ఉపాధి పని ప్రదేశాల్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నాలుగు వారాల నుండి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో కూలీలు, పేదలు నానావస్థలు పడుతున్నారని మండిపడ్డారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో పనిముట్లు, మెడికల్ కిట్స్, మజ్జిగ పంపిణీ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. పనులు జరుగుతున్నా ప్రతివారం వేతనాలు పడకపోవడం, ఒకపక్క నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.


బుట్టాయగూడెం: మజ్జిగ పంపిణీ చేస్తున్న తామా ముత్యాలమ్మ


అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్న సిడిపిఒ పద్మావతి

సిడిపిఒచే అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాలను కొయ్యలగూడెం సిడిపిఒ పద్మావతి సోమవారం పరిశీలించారు. సమ్మె అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరే విధులు నిర్వర్తిస్తున్నారా లేదా అనే విషయాలపై అంగన్వాడీల నిర్వహణా తీరుపై పరిశీలన చేసినట్లు సిడిపిఒ తెలిపారు. పోలవరంలో బెస్తవీధి, వడ్డిలపేట, పాతపోలవరం, ఏనుగుల వీధి అంగన్వాడీలను పరిశీలించినట్లు తెలిపారు. సిడిపిఒతో పాటు పోలవరం మండల ఇన్‌ఛార్జి సిడిపిఒ రాణి, సిబ్బంది ఉన్నారు.


నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

పలు గ్రామాల్లో కొల్లి నాగేశ్వరరావు వర్ధంతి సభలు

ప్రజాశక్తి - ముసునూరు

కీర్తిశేషులు కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతి మండలంలోని గుడిపాడు గ్రామంలో సోమవారం నిర్వహించారు. చం॥ రాజేశ్వరరావు గ్రంథాలయం వద్ద కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతి రైతు సంఘం జిల్లా నాయకులు కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ పోరాట యోధులు, రైతు నాయకులు కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాగునీరు, తాగునీరు సరఫరా కోసం కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం కోసం కొల్లి నాగేశ్వరరావు అహర్నిశలు కృషి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ జల దర్పిణి పుస్తకం రచించి ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డితో పుస్తక ఆవిష్కరణ జరిపించిన మహవ్యక్తి అని కొనియాడారు. భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేసి వారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుతో మొదటి సారిగా పట్టాలిప్పించారని చెప్పారు. గుడిపాడు, గుళ్లపూడి, వలసపల్లి, చెక్కపల్లి గ్రామాల్లో ప్రజలు కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న హరి, మూర్తి, తదితరులు

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్ట్ కిషోర్ మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సీనియర్ జర్నలిస్ట్ కిషోర్ తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. కిషోర్ మరణ వార్త తెలుసుకున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ హరి, గౌరవ అధ్యక్షులు మూర్తి బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. కిషోర్ మృతదేహానికి ప్రింట్ మీడియా ఆంధ్ర ప్రభ రిపోర్టర్ ఆజాద్ చెన్నారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మిగతా కార్యక్రమాలు నిర్వహించేందుకు బాధిత కుటుంబానికి తోడ్పాటు అందించారు. కిషోర్ మృతదేహానికి ఎయిమ్ నాయకులు కత్తర సత్యం సంఘీభావం నివాళులర్పించారు. వైసిపి నాయకులు వెంప కృష్ణ, పలువురు రిపోర్టర్లు నివాళులర్పించారు.


గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఎస్‌పి, సిఐ

దళిత యువకుడిపై దాడి ఘటనపై విచారణ

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని కంఠమనేనివారిగూడెంలో ఈ నెల 18వ తేదీ శనివారం రాత్రి దళిత యువకుడిపై దాడి ఘటనపై సోమవారం జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర, సిఐ రాజేష్ దర్యాప్తు చేశారు. ఘటనపై బాధితులను, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రవిచంద్ర మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ విచారణలో వారితో పాటు తడికలపూడి ఎస్ఐ జయబాబు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

కోళ్ల వ్యర్థాలు అక్రమ తరలింపు

మూడు వాహనాలు పట్టివేత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా చేపల చెరువులకు కోడి వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్న మూడు లారీలను పెదపాడు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపాడు మండలంలో చేపల పెంపకం విస్తారంగా సాగుతుంది. దీంతో కొందరు అక్రమార్కులు చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను వేసి క్యాట్ ఫిష్‌ను పెంచుతున్నారు. దీనిపై నిఘా పెట్టిన పెదపాడు పోలీసులు సోమవారం తెల్లవారుజామున కోళ్ల వ్యర్థాల వాహనాల కోసం కాపు కాశారు. మూడు బృందాలుగా ఏర్పడి వాహనాల కోసం కాపు కాశారు. కోడి వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్న మూడు వాహనాలను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. మూడు వాహనాల డ్రైవర్లను అదుపులోకి తీసుకుని, వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పరస్పర కేసులు నమోదు

ప్రజాశక్తి - ముసునూరు

ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కోన లలిత కుమారి, కోన పిచ్చయ్య ఇరువురు పోట్లాడుకున్నారు. అనంతరం ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుంగిన వంతెన.. నిర్మాణం చేపట్టేనా..!

పాడైన కామవరపుకోట, లింగపాలెం మండలాల మధ్య బ్రిడ్జి

ప్రమాదమని తెలిసినా ప్రజలు, రైతుల రాకపోకలు

పట్టించుకోని అధికారులు, పాలకులు


కుంగిన కామవరపుకోట, లింగపాలెం మండలాల మధ్య వంతెన

ప్రజాశక్తి - కామవరపుకోట

అది రెండు మండలాలను కలిపే ప్రధానమైన రోడ్డు. దాని మీద ఉన్న వంతెన రెండు మండలాలకు కలిపే సరిహద్దు. కామవరపుకోట మండలం కళ్లచెరువు, లింగపాలెం మండలం ఆసన్నగూడెం గ్రామాల మధ్య గ్రామంలో ఉన్న వంతెన కామవరపుకోట, లింగపాలెం మండలాలకు సరిహద్దు, ప్రధానమైన రహదారి. ఈ దారి గుండా నిత్యం అనేక వాహనాలు, భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మొక్కజొన్న, పామాయిల్ అనేక రకాల వ్యవసాయ ఉత్పత్తులు ఈ వంతెన మీద నుంచి వివిధ ఫ్యాక్టరీలకు ఈ రెండు మండలాల నుంచి రైతులు ఎగుమతి, దిగుమతి చేస్తున్నారు. రైతులు తమ సరుకు రవాణా కోసం, వ్యవసాయ కూలీల రవాణా కోసం ఈ వంతెన మీద నుంచే వెళ్తారు. కామవరపుకోట, లింగపాలెం మండలాలకు ఇంత అవసరమైన ఈ వంతెన పూర్తిగా పాడై సుమారు పదేళ్ల పైనే అవుతుంది. అయిన రోజు అనేక వాహనాలు, భారీ నుంచి అతి భారీ వాహనాలు కూడా ఈ కుంగిపోయిన బ్రిడ్జి గుండా ప్రయాణిస్తున్నాయి. అయినా ఈ బ్రిడ్జి గురించి పట్టించుకునే వారే లేరని ప్రజలు వాపోతున్నారు. ఈ బ్రిడ్జి మీదుగా ప్రయాణించడం సురక్షితమా, ప్రమాదమా అనే తెలియని అయోమయ పరిస్థితిలో వాహన చోదకులు, ప్రజలు నిత్యం తమ రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జి దగ్గరలో ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డులను రాత్రి సమయంలో రహదారి గుండా వెళ్లే కొంత మంది ఆకతాయిలు తొలగించేస్తున్నారు. గతేడాది సుమారు రూ.5.50 కోట్ల వ్యయంతో ఇక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా అనుమతులు మంజూరు కాలేదని, దీంతో ఈ ఏడాది బ్రిడ్జి డైవర్షన్ రోడ్డు కోసం సుమారు రూ.20 లక్షల వ్యయంతో పనులు మంజూరయ్యాయని, అవి త్వరలోనే ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. అంటే ఇప్పట్లో ఈ బ్రిడ్జికి మోక్షం లేదా అని రెండు మండలాలకు చెందిన రైతులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రానున్నది వర్షాకాలం, వర్షాలు ఎక్కువ పడి వరదలు వస్తే పనులు పూర్తి చేయకపోతే ఈ రెండు మండలాలకు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. రానున్న రోజుల్లో అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ఈ రెండు మండలాలకు ఉపయోగకరమైన ఈ వంతెన నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూల అన్నారు. వీరిశెట్టిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చిన్నారుల ఇబ్బందులపై అంగన్‌వాడీ కేంద్రం....సదుపాయలు శూన్యం అనే శీర్షికన ఈ నెల 16వ తేదీన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జంగారెడ్డిగూడెం సిడిపిఒ పి.బ్యూల స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించామని, నిధుల లభ్యతను బట్టి త్వరలోనే ఆ కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం (సమ్మర్ క్యాంపు)లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించారు. రిసోర్సెస్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులతో నీతి కథలు చదివించి కథల్లోని నీతిని చిన్నారులతో వివరించారు. వంటగదిలో ఉండే పప్పుధాన్యాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు. మాటల గారడీ - నాపేరులో ఇంకొక పేరు అంశాలపై సరదా ఆటలు ఆడించారు. రిసోర్సెస్ పర్సన్ ఎం.కల్యాణి విద్యార్థులకు జనరల్ అవేర్నెస్ (జికె)పై క్విజ్ పోటీలు నిర్వహించారు. రిసోర్సెస్ పర్సన్ టి.నళిని విద్యార్థులకు దేశ భక్తి పాటలు, అన్నమాచార్య కీర్తనలు, దేవుని పాటలపై శిక్షణ కొనసాగించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. మధ్యలో విద్యార్థులందరికీ స్నాక్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది విటి.సందీప్‌కుమార్, ఎండిఎ.అస్లాం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో...

విద్యార్థులకు ఆటలు, కథల పోటీలు

ముదినేపల్లి :ముదినేపల్లి, గురజ గ్రామాల్లోని శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు సోమవారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయాల అధి కారిణిలు శ్రీదేవి, ఝాన్సీ ఆధ్వర్యంలో ఆటలు, కథల పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన అంశాలపై అవగాహన కల్పించారు.


సిహెచ్‌సిలో డయాలసిస్ కేర్ సెంటర్ సందర్శన

రోగులకు పండ్లు అందించిన ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్

ప్రజాశక్తి - కైకలూరు

కిడ్నీ, లివర్ వ్యాధిగ్రస్తుల సభస్యల పరిష్కారానికి కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. కైకలూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల ఎనిమిదో తేదీన ప్రారంభించిన డయాలసిస్ కేర్ సెంటర్‌ను ఆయన సోమవారం సందర్శించారు. కిడ్నీ బాధిత పేషెంట్లను పరామర్శించి వారికి పండ్లు అందించారు. కిడ్నీ బాధిత పేషెంట్లు మాట్లాడుతూ తాము డయాలసిస్ చేయించుకోవాలంటే ఏలూరు, భీమవరం, విజయవాడ వంటి దూర ప్రాంతాలకు నానా అవస్థలు పడుతూ వెళ్లేవారమని, కానీ ఇప్పుడు కైకలూరులోనే ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణ ఖర్చుతో పాటు అవస్థలు తీరాయని, చాలా ఆనందంగా ఉందని తెలిపారు.


కిడ్నీ రోగులకు పండ్లు అందిస్తున్న ఎంఎల్‌ఎ డిఎన్‌ఆర్


రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న లావణ్యవేణి

ఇవిఎంల భద్రత విషయంలో అప్రమత్తత అవసరం

జెసి, ఆర్ఒ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను జెసి, దెందులూరు రిటర్నింగ్ అధికారి బి.లావణ్య వేణి సోమవారం పరిశీలించారు. ఏలూరులోని సర్ సిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూంను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇవిఎంల భద్రత విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలను పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిష్టర్‌లో ఆమె సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇవిఎం కంట్రోల్ రూంను పరిశీలించారు.

సూర్యప్రభ వాహనంపై చినవెంకన్న

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఉదయం శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై భక్తులకు సాయంకాలం చంద్రప్రభ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు.

15,16,17 తేదీల్లో రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభ

ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జూన్ 15, 16, 17, తేదీల్లో ఏలూరులో జరిగే రైతుకూలి సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సంఘం సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదివాసీ పోరాటాలు, రైతుల పోరాటాలు, రైతు రక్షణ యాత్ర వంటి గొప్ప పోరాటాలకు నాయకత్వం వహించిన రైతు నాయకులను కన్న గడ్డ ఈ మహాసభలకు వేదిక కావటం ఆనందదాయకమన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి, దేశ ప్రజానీకానికి ప్రమాదకరమైన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను ముందుకు తెచ్చిందని, ఈ చట్టాల రద్దు కోసం దేశవ్యాప్తంగా రైతాంగం సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఆందోళన సాగించిందని, ఫలితంగా ప్రభుత్వం చట్టాల రద్దుకు హామీ ఇచ్చినా దానిని అమలు చేయలేదని తెలిపారు. రైతుకూలి సంఘం ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే మద్దతు ధరలు, గ్రామీణ జీవన సంక్షోభం, భూముల పరాయికరణ, వ్యవసాయ కూలీల, పేద రైతుల వలసలు, కౌలు రైతుల దురవస్త, ఆదివాసీల జీవన విధ్వంసం వంటి సమస్యలపై పోరాడుతుందన్నారు. రైతులపై మోపుతున్న పంట ఖర్చుల భారాలను అదుపు చేయకపోవడమే కాకుండా సాగునీరు అందించాల్సిన అవసరాన్ని పాలకులు విస్మరించారని విమర్శించారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ హామీని అటకెక్కించారని, దేశవ్యాప్తంగా 2.10 కోట్ల వ్యవసాయ విద్యుత్ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించి నామమాత్రంగా ఇచ్చే ఉచిత విద్యుత్‌ను కూడా ఎగవేయనున్నారని తెలిపారు. వ్యవసాయం గిట్టుబాటు కాక భూములను అమ్ముకునేవారు కొందరైతే ఆ భూములను కౌలుకు ఇచ్చి పట్టణాలకు మరికొందరు తరలిపోతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో మరే ఇతర ఉపాధి అవకాశాలు లేక కూలీనాలీ పనులు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండటంతో దీనిపై ఆధారపడిన గ్రామీణ పేద, కూలి, రైతుల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకునేందుకు జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులోని టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో జరిగే రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.భాషా పాల్గొన్నారు.

వరి పొలాల్లో మట్టి అక్రమ తవ్వకం


గ్రామస్తులు, రైతుల ఆవేదన

రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని గగ్గోలు


రాత్రి సమయంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని చేబ్రోలు, తల్లాపురం, కైకరం, బొమ్మిడి, బాదంపూడి తదితర డెల్టా గ్రామాల్లోని వరి పొలాల్లో మెరకలను తొలగించే నెపంతో నల్ల మట్టిని తవ్వి తరలించేస్తున్నారు. పెద్దపెద్ద యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్ల సాయంతో నల్ల మట్టిని అమ్ముకుంటున్నా అరికట్టాల్సిన అధికారులు, యంత్రాంగం చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. వరి పొలాల్లో మెరక కారణంగా సాగునీరు అందటం లేదనే సాకుతో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జెసిబి, పొక్లెయిన్‌ల సాయంతో తవ్వి నల్ల మట్టిని ఇటుక బట్టీలు, కొబ్బరి తోటలు, అనధికార లే అవుట్ కోసం అమ్ముకుంటూ రవాణా చేస్తున్నారు. అక్రమ తవ్వకాలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి మాఫియాతో పలువురు రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి అక్రమ మట్టి తవ్వకాలను జరిపిస్తున్నారని తల్లాపురం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


మాట్లాడుతున్న కొలుసు పార్థసారథి

రానున్నది టిడిపి కూటమి ప్రభుత్వమే

కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం, తాను నూజివీడు ఎంఎల్‌ఎగా మెజార్టీతో సంబంధం లేకుండా గెలుపొందటం ఖాయమని టిడిపి నూజివీడు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరు మండలంలోని గోపవరం, వేల్పుచర్ల గ్రామాల్లో టిడిపి మండలాధ్యక్షుడు దేవినేని ధలరాం అధ్యక్షతన సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకొచ్చేది టిడిపి కూటమి ప్రభుత్వమేనన్నారు. ఆయా గ్రామాల్లో టిడిపి గెలుపునకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేటి నుంచి జగన్నాథ స్వామి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దేశంలో రెండో చిన్న పూరిగా పేరుగాంచిన మండలంలోని వడాలిలో ఉన్న జగన్నాథ స్వామి వారి కళ్యాణోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇఒ సింగనపల్లి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21న వేణుగోపాల స్వామివారిని, సత్యభామ, రుక్మిణి అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా, స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరణ చేయడం, 22న బుధవారం రాత్రి దివ్య కళ్యాణం, 23న రాత్రి స్వామివారి రథోత్సవం, 24న పూర్ణాహుతి, 25న ద్వాదశ ప్రదక్షిణలు, 26న ఉదయం 11 గంటలకు అఖండ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని ఇఒ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజు రాత్రి ఆలయం ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కైకలూరు

జూనియర్ ఎన్‌టిఆర్ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని పలువురు అన్నారు. స్థానిక కలిదిండి రోడ్ సెంటర్‌లో జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలను ఎన్‌టిఆర్ యువసేన ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రోగులకు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బికెఎం నాని, పి.త్రినాథ్‌రాజు, కెకె.బాబు, కాళ్లపాలెం బుజ్జి, వీరాబత్తిన సుధ, మన్నే అశోక్ గజపతిరాజు, తలారి రాజేష్, ఎండి.భాషిద్, టి.నాగేశ్వరరావు, పడమట వాసు, యమల మణి, అభిమానులు పాల్గొన్నారు.